క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలిక గురుకుల డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్, జీవిత నైపుణ్యాలు, మానవీయ విలువలు, కంప్యూటర్ పరిజ్ఞానం అనే అంశాలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.విజయలక్ష్మి తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్, గురుకుల సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల కళాశాల పూర్వ విద్యార్థినులు ఈనెల 30వ తేదీలోపు కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గోల్డ్‌స్టార్ సేవా ప్రతిభ అవార్డుకు జయరాజ్ ఎంపిక



మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జయరాజ్.. ప్రతీ పండగకు ఓ పేద కుటుంబానికి నిత్యావసర సరుకులను అందించడమే కాకుండా, ఐ డొనేషన్ చేయించడంతో పాటు విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తూ, ఇప్పటి వరకు 35 సార్లు రక్త దానం చేశారు. ఈమేరకు ఆయన సేవలకు గోల్డ్‌స్టార్ సేవా ప్రతిభ అవార్డు దక్కింది. ఈనెల 31వ తేదీన హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో అవార్డును అందుకోనున్నట్లు జయరాజ్ తెలిపారు.

శిరీషకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆడపు శిరీషకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ ప్రకటించింది. ఆ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధకురాలుగా ఎక్స్‌పరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ ది ఇన్‌ఫ్లుయెన్స్ ఆఫ్ నానోఫిల్లర్స్ లోడింగ్ ఇన్ లిక్విడ్ సిలికాన్ రబ్బర్ కాంపోజిటీస్ ఫర్ ఎలక్ట్రికల్ ఇన్సులేటర్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శిరీషకు డాక్టరేట్‌ను జేఎన్‌టీయూ ప్రదానం చేసింది. జేఎన్‌టీయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్లు చెన్నకేశవ రెడ్డి, సమ్మయ్య పర్యవేక్షణలో శిరీష తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

మీ సేవ కేంద్రాల్లో తనిఖీలు



ఖిలా వరంగల్: మీసేవ కేంద్రాల్లో అధిక రుసుము వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని మీసేవ కేంద్రం జిల్లా మేనేజర్ రాజ్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు బుధవారం ఖిలా వరంగల్ మండల పరిధి మీసేవ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మీసేవ కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యకలాపాలను పరిశీలించారు. కేంద్రానికి వివిధ పనులపై వచ్చిన వినియోగదారులను అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మీసేవ కేంద్రాలు పారదర్శకంగా పని చేయాలని, నిబంధనలు అతిక్రమించి అధికంగా వసూళ్లకు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌరులకు స్పష్టంగా కనిపించేలా పౌర సేవలు, చార్జీలను ప్రదర్శించాలని సూచించారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలన్నారు. అనధికార ప్రదేశాల్లో మీసేవ కేంద్రాలు నడపవద్దని ఆదేశించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



హన్మకొండ చౌరస్తా: జూన్ 21వ తేదీన యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 25 రోజుల పాటు నిర్వహించేలా యోగా దశాబ్ది వేడుకల ప్రణాళికను రూపొందించినట్లు రాయపుర యునాని ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేంద్రకుమార్ తెలిపారు. ఈమేరకు ఆరోగ్య మందిరాలు, వైద్యాధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సమాఖ్య సభ్యులతో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే నినాదంతో యోగా సంఘం, యోగా ప్రభావ, హరిత యోగా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాయపుర యునాని ఆస్పత్రి ఆవరణలో 25 రోజుల పాటు యోగా శిక్షకులతో నిర్వహించే తరగతులను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు, జరిమానా

రామన్నపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష, 17 మందికి రూ.18,300 జరిమానా విధిస్తూ జడ్జి అబ్బోజు వెంకటేశం తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు సీఐ వివరించారు.


మహిళల భద్రతకు 'టీ సేఫ్'

ఒంటరిగా ప్రయాణించే వారికి ప్రయోజనం

కాజీపేట: ఓ యువతి హైదరాబాద్ నుంచి వరంగల్‌కు రైలులో వచ్చింది. ఆమెతో పాటే ప్రయాణించిన కొందరు యువకులు ఆ యువతితో ఇబ్బందికరంగా ప్రవర్తించారు. వారి నుంచి ఎలా బయటపడాలో ఆమెకు అర్థం కాలేదు. ఆ సమయంలో రైల్వే పోలీసులు అటువైపు రావడంతో ఆ యువకులు అక్కడి నుంచి పారిపోయారు. ఇలాంటి సంక్లిష్టమైన సమయంలో ఒంటరిగా వెళ్లే మహిళలు, యువతులకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ పోలీసు శాఖ టీ సేఫ్ యాప్ అందుబాటులోకి తెచ్చింది. దీని ఉపయోగం తెలియక, ప్రచారం లేకపోవడంతో అతివలు ఈ సేవలను ఎక్కువగా వినియోగించుకోవడం లేదు.

ఎక్కువసేపు స్పందించకుంటే..

టీ సేఫ్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న మహిళ, యువతి వెళ్లే వాహనం దారి మారినా, పోలీసులు ప్రతీ అయిదు నిమిషాలకు ఒకసారి పంపించే హెచ్చరిక ఎస్‌ఎంఎస్‌కు బదులు ఇవ్వకున్నా అనుమానాస్పదంగా పరిగణిస్తారు. ఎక్కువ సమయం స్పందించకుంటే ఆటోమెటిక్‌గా డయల్ 100కు సమాచారం వెళ్తుంది. స్థానిక పోలీసు స్టేషన్‌కు లేదంటే బాధితురాలి లొకేషన్ సమీపంలోని పెట్రోలింగ్ వాహనానికి సమాచారం చేరుతుంది. క్షణాల్లో పోలీసులు అక్కడికి చేరుకుంటారు.



టీ సేఫ్ యాప్

ప్రచారం తక్కువ

ఈ యాప్‌ను ప్రవేశ పెట్టి దాదాపు ఏడాది దాటింది. దీని ఉపయోగం చాలా మంది మహిళలు, యువతులకు తెలియకపోవడంతో ఎవరూ తమ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవడం లేదు. పోలీసు శాఖ దీనిపై విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతగానో ఉంది. ఒంటరిగా ప్రయాణించే మహిళలు, యువతులకు ఇది రక్షణ కవచంలా పనిచేస్తుంది.

ఎలా పనిచేస్తుందంటే..

టీ సేఫ్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఉపయోగించుకునే మహిళ పేరు, ఫోన్ నంబర్ నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాలి. హెల్ప్ సిటిజన్ విభాగంలో క్లిక్ చేసి.. వెళ్లాల్సిన ప్రాంతం, ప్రయాణించే వాహనం రిజిస్ట్రేషన్ నంబరు, రైల్లో వెళ్తే దాని నంబరు నమోదు చేయాలి.అనంతరం స్టార్ట్ బటన్ నొక్కగానే పోలీసు పర్యవేక్షణ మొదలవుతుంది. ఒకసారి సదరు వాహనం ప్రారంభం కాగానే పోలీసులు ఆ లొకేషన్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తత అవసరం

- యాక్షన్‌ప్లాన్ పక్కాగా అమలు చేయాలి
- నగర మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న మేయర్, పక్కన కమిషనర్

వరంగల్ అర్బన్ : ముందస్తుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, మాన్‌సూన్ యాక్షన్‌ప్లాన్ పక్కాగా అమలు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బుధవారం సాయంత్రం బల్దియాలోని తన చాంబర్‌లో కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆమె గ్రేటర్ వరంగల్‌లో రూపొందించిన మాన్‌సూన్ యాక్షన్‌ప్లాన్ అమలుపై సమీక్షించారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ ఈ ఏడాది రుతుపవనాలు రెండు వారాలు ముందుగా వచ్చిన నేపథ్యంలో ప్రతి ఏఈకి ఐదుగురు సిబ్బందిని కేటాయించాలని సూచించారు. ప్రధాన కార్యాలయంలో 24/7 అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. డీఈ స్థాయి అధికారి మొత్తం ప్రక్రియను పర్యవేక్షించేలా చూడాలని పేర్కొన్నారు. శిథిలావస్థలోని నిర్మాణాలను గుర్తించి, నివాసితులను వెంటనే ఖాళీ చేయించాలన్నారు. అపార్ట్‌మెంట్ల సెల్లార్‌లలో వరద నీరు నిల్వ ఉండకుండా, విద్యుత్ సర్క్యూట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నిర్మూలనకు ఫాగింగ్‌తోపాటు బావుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. సమావేశంలో సీఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, సీపీ శ్రీనివాస్, రవీందర్ రాడేకర్, ఈఈలు రవికుమార్, సంతోష్ బాబు, మాధవీలత, రవికుమార్ పాల్గొన్నారు.

ధరల నియంత్రణ కమిటీ పాత్ర కీలకం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ధరల నియంత్రణ కమిటీ పాత్ర కీలకమని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం ప్రైస్ కంట్రోల్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థికసాయం, ఇసుకతోపాటు ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే సంబంధిత మెటీరియల్‌ను నిర్ణీత ధరకు అందించడానికి బల్దియా పరిధిలోని వర్ధన్నపేట, వరంగల్ ఖిలావరంగల్, గీసుకొండ మండలాల తాపీమేస్త్రి అసోసియేషన్, మెటీరియల్ విక్రయదారుల యూనియన్ నాయకులతో సంప్రదింపులు జరిపినట్లు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్

వరంగల్ చౌరస్తా / ఖిలా వరంగల్: రైతులకు నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వమే అందించే విధంగా చొరవ తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ సూచించారు. వరంగల్ స్టేషన్ రోడ్డులోని హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో బుధవారం నిరసన వ్యక్తం చేసి, అనంతరం రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలకు విచ్చలవిడిగా లైసెన్సులు ఇవ్వడంతో నకిలీ విత్తనాలను యథేచ్ఛగా అమ్ముతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాలు నాణ్యమైన దొరకక, ఏదో ఒక విత్తనాలను రైతులు కొనుగోలు చేయక తప్పడం లేదని అన్నారు. ప్రైవేట్ కంపెనీలు తమకు ఇష్టం వచ్చిన ధరలకు విత్తనాలు అమ్ముతున్నాయని అన్నారు. రైతులు విత్తన ప్యాకెట్‌పై ధర ఎంత ఉందో చూసిన తర్వాతే కొనుగోలు చేయాలని, బిల్లు లేకుండా ఎట్టి పరిస్థితుల్లో విత్తనాలు కొనుగోలు చేయరాదని సూచించారు. రైతు సంఘం నాయకులు ఓదెల రాజయ్య, చర్ల రవీందర్, సమ్మారావు, కురిసెట్టి అశోక్, బరపటి రామ్మూర్తి రాజు, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

అహల్యాబాయి జీవితం ఆదర్శం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్: పుణ్యశ్లోక, లోకమాత రాణి అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాలను బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. నేటి తరానికి అహల్యాబాయి చరిత్ర ఆదర్శమని అన్నారు. పెసరు విజయచందర్ రెడ్డి, ఉషాదేవి, సంపత్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

ఆర్‌ఓబీ నిర్మాణంపై సమీక్ష

న్యూశాయంపేట: చింతలపల్లి, జాన్‌పీరీలు లెవల్ క్రాసింగ్ 63 వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం, ఇన్నర్ రింగ్ రోడ్ పనులపై ఆర్‌అండ్‌బీ, రైల్వే అధికారులతో కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారద బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అండర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నందున దానికి 130 మీటర్ల ప్రక్కనే ఇన్నర్ రింగ్ రోడ్ వస్తున్నందున ఇన్నర్ రింగ్ రోడ్‌ను ఆర్‌ఓబీగా మార్చినట్లయితే అన్ని వాహనాలకు సౌకర్యంగా ఉంటుందన్న అంశంపై అధికారులతో మాట్లాడారు. ఈసమీక్షలో 'కుడా', ఆర్‌అండ్‌బీ, రైల్వే ఇంజనీర్స్‌తో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, 'కుడా' చీఫ్ ప్లానింగ్ అధికారి అజిత్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ దేవి, రైల్వే సెక్షన్ ఇంజనీర్ సుభాష్, సూపరింటెండెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

శిక్షణలో నేర్చుకున్నవి అమలు చేయాలి

- వరంగల్ జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ సుజన్‌తేజ
- ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ



మాట్లాడుతున్న సుజన్‌తేజ

విద్యారణ్యపురి: ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలని నాణ్యమైన విద్యాబోధన, నూతన పద్ధతుల్లో బోధించాలని వరంగల్ విద్యాశాఖ క్వాలిటీ కో–ఆర్డినేటర్ సుజన్‌తేజ అనఅనఅన్నారు. వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న వివిధ సబ్జెక్టుల టీచర్లకు ఐదురోజులుగా ఉర్సు గుట్ట వద్ద ఉన్న బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం సాయంత్రం ముగిసింది. ఈముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. టీచర్లు సాంకేతికతను ఉపయోగించుకుని ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్స్ ద్వారా విద్యార్థులకు డిజిటల్ తరగతి బోధనలు చేయాలన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్లుగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఈ ముగింపు సమావేశంలో ఘనంగా సన్మానించారు. సమావేశంలో శిక్షణా కేంద్రం ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్‌రావు, డీసీఈబీ సెక్రటరీ జి.కృష్ణమూర్తి పాల్గొన్నారు. వరంగల్ జిల్లాలో మూడు దశల్లో మొత్తంగా సుమారు 1,800 మంది స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ పూర్తయ్యింది.

కేయూ పరిపాలన భవనంలో లిఫ్ట్

- రెండుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనంలో రూ.13లక్షల 65వేలు వెచ్చించి ఏర్పాటు చేసిన లిఫ్ట్, రూ.6 లక్షల వ్యయంతో సివిల్‌వర్క్స్, అలాగే క్యాంపస్‌లోని రెండు చోట్ల ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంతో కలిసి వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు, మొదటి అంతస్తులోని వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులకు లిఫ్ట్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. క్యాంపస్‌లోని విద్యుత్ అంతరాలు తగ్గించేందుకు కామర్స్ విభాగం ప్రాంతం, ఆడిటోరియం ప్రాంతంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, హైటెన్షన్ లైన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కేయూ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వాసుదేవరెడ్డి, కేయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్, డాక్టర్ అనితారెడ్డి, డాక్టర్ సుకుమారి, డాక్టర్ నవీన్, డాక్టర్ రమ, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ చిర్ర రాజు, అకుట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ వెంకట్రామ్ రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్, ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వరలక్ష్మి, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ఈసం నారాయణ, కేయూ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి, వర్సిటీ ఇంజనీర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల భూమి కబ్జాకు యత్నం



మాట్లాడుతున్న న్యాయవాదులు

కాజీపేట అర్బన్: రాజీవ్ అడ్వకేట్స్ సొసైటీ వెంచర్‌లోని పార్కు స్థలాన్ని కబ్జా చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు యత్నిస్తున్నారని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్ రెడ్డి, నీల శ్రీధర్‌రావు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్ హౌసింగ్ సొసైటీకి ప్రభుత్వ భూమి కేటాయించాలని 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని న్యాయవాదులు వేడుకున్నారు. కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్‌గృహకల్ప సముదాయం వెనుకాల 20 ఎకరాల భూమిని 209 మంది సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి, 2008 – 2009లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు ఆ స్థలంలోని పార్కు స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించగా, మడికొండ పోలీసు స్టేషన్‌లో బాధిత న్యాయవాదులు బుధవారం ఫిర్యాదు చేశారు.

పరిశోధనలకే పరిమితం కావొద్దు



స్కాలర్స్‌తో పృథ్వీరాజ్, మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: పరిశోధకులు కేవలం పరిశోధన అంశాలకే పరిమితం కాకుండా, తరగతి గది అవతల కూడా విశ్లేషించి నాణ్యమైన సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టి సారించాలని కేయూ మాజీ రిజిస్ట్రార్, గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి కోరారు. విశ్వవిద్యాలయంలో ఇటీవల పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందిన సైన్స్ విభాగం పరిశోధకులకు గణిత శాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహించిన రీసెర్చ్ మెథడాలజీపై విస్తృత ఉపన్యాసం చేశారు. సామాజిక, ఆర్థిక, ఫిజికల్, సైకాలజికల్ అంశాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నారు. కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ మాట్లాడుతూ పరిశోధకులు తమ పరిశోధనల్లో వచ్చే అడ్డంకులను ఎలా అధిగమించాలి, భావోద్వేగాలు, మానసిక పరమైన అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ ఆర్.భారవిశర్మ, గణితం, స్టాటిస్టిక్స్, మైక్రోబయాలజీ, బయో టెక్నాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల పరిశోధకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పరకాల మాజీ కౌన్సిలర్‌పై హత్యాయత్నం

హసన్‌పర్తి: పరకాల మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్‌పై ప్రత్యర్థులు రాడ్లతో దాడి చేశారు. దాడిలో ఆయనకు గాయాలయ్యాయి. ఈ ఘటన వంగపహాడ్–ఆరెపల్లి మధ్యలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... పరకాల మాజీ కౌన్సిలర్ పల్లె దశరథం బుధవారం ఇంటి నుంచి బైక్‌పై హనుమకొండకు బయలుదేరాడు. అప్పటికే దశరథం బైక్‌పై వెళ్తున్నట్లు గమనించిన ప్రత్యర్థులు ఆయనపై దాడి చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. దీంతో వంగపహాడ్–ఆరెపల్లి మధ్యలో జాతీయ రహదారిపై మాటు వేశారు. దశరథం వంగపహాడ్ దాటిన తర్వాత ప్రత్యర్థులు అతని బైక్‌ను అడ్డుకుని పొత్తి కడుపుపై ఇనుపరాడ్లతో దాడి చేశారు. ప్రత్యర్థుల దాడినుంచి చాకచక్యంగా తప్పించుకున్నారు. ప్రస్తుతం అతను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

పాత కక్షలే కారణం?

ఈ దాడికి పాత కక్షలే కారణమని స్థానికులు చెబుతున్నారు. మాజీ కౌన్సిలర్ దశరథానికి, పరకాలకు చెందిన ఓ వ్యక్తి మధ్య పాత కక్షలు ఉన్నట్లు సమాచారం. ఏడాదిన్నర క్రితం సదరు వ్యక్తిపై దశరథం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించినట్లు స్థానికులు తెలిపారు. ఆ కక్షలను దృష్టిలో పెట్టుకుని దాడికి పాల్పడి ఉండవచ్చని చర్చించుకుంటున్నారు.

వ్యక్తి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి కరీమాబాద్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కరీమాబాద్‌కు చెందిన గోల్కొండ ప్రసాద్ (35) హైదరాబాద్‌లోని ఓ హోటల్ పనిచేస్తూ భార్య సబిత, ఇద్దరు పిల్లలను సాకుతున్నాడు. హైదరాబాద్ హోటల్ పనిచేస్తూ కరీమాబాద్‌కు పదిరోజులకు ఒకసారి ఇంటికి వచ్చి వెళ్తుంటాడు. ఇంటికి వచ్చిన ప్రసాద్ గతనెల 17న హైదరాబాద్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. హోటల్‌కు, అద్దెకు తీసుకున్న గదికి వెళ్లకుండా ఎక్కడి వెళ్లాడో తెలియదు. ఈ విషయం తెలిసి బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో గోల్కొండ సబిత బుధవారం ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ వివరించారు.

యూట్యూబర్ చిలుక ప్రవీణ్‌పై ఫిర్యాదు



ఖిలా వరంగల్: మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఓ యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు చిలుక ప్రవీణ్‌పై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సురేష్‌కు ముస్లిం మతపెద్దలతో కలిసి తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ.జబ్బార్ బుధవారం ఫిర్యాదు చేశారు.

చర్య తీసుకోవాలని వినతి

న్యూశాయంపేట: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ చిలుకూరి ప్రవీణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈమేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో డీసీపీ సలీమా, హనుమకొండ ఏసీపీ నర్సింగరావును బుధవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు.

మంద కృష్ణకు గౌరవ డాక్టరేట్ ప్రకటించాలి

కేయూ క్యాంపస్: పద్మశ్రీ అవార్డు స్వీకరించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగకు కాకతీయ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించాలని ఏబీఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ లైబ్రరీ వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దార సురేష్, భద్రన్న, కిరణ్, సాయి, వెంకటేష్, శ్రీనివాస్, చరణ్, నరేందర్, విజయ్, పీటర్ మధు, బన్ని పాల్గొన్నారు.

కాజీపేట అర్బన్: పద్మశ్రీ అవార్డును మంద కృష్ణ మాదిగ అందుకోవడంపై టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరాట ఉద్యమానికి దక్కిన గౌరవమని అన్నారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

ఖిలా వరంగల్: వరంగల్ పర్యటనలో ఉన్న బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌ను బీజేపీ నేత, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌కు పట్టువస్త్రాలు అందజేసి సన్మానించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

కాజీపేట: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు జయంతిని కాజీపేట చౌరస్తాలో కార్యకర్తలు బుధవారం జరుపుకున్నారు. వరంగల్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బర్ల యాకుబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నయింనగర్: ఎన్టీఆర్ 102వ జయంతిని టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ పెట్రోల్‌పంపు జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలి

హసన్‌పర్తి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేయాలని భారత రాష్ట్ర సమితి హసన్‌పర్తి మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ అన్నాసాగరం గ్రామ అడ్‌హక్ కమిటీని బుధవారం ప్రకటించారు.

మారోజు వీరన్న స్ఫూర్తితో ముందుకు..



నివాళులర్పిస్తున్న నరేందర్, నాయకులు

కాజీపేట అర్బన్: కుల, వర్గ నిర్మూలన జమిలి పోరాట యోధుడు, ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడు మారోజు వీరన్న స్ఫూర్తితో ముందుకు సాగుదామని ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. మారోజు వీరన్న 26వ వర్ధంతి సందర్భంగా హనుమకొండ అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వీరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ వీరన్న ఆశయ సాధనలో బహుజన రాజ్యాన్ని సాధిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి హంసారెడ్డి, నేదునూరి రాజమౌళి, వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

విద్యారణ్యపురి: జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని టీఎస్‌ఎఫ్ (తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ వాసంతిని సంఘం బాధ్యులతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖమంత్రిని కేటాయించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ కాడపాక రాజేందర్, ఎస్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, బాధ్యులు కోట రమేష్, నాగారం మణితేజ, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

హసన్‌పర్తి: 65వ డివిజన్ దేవన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో లీకేజీ అయిన మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. పైపులైన్ లీకేజీతో రెండు రోజులుగా నీరు వృథాగా పోతోందని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దాంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి బుధవారం మరమ్మతులు చేయించారు.